క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జ్ ఎఫ్‌డీఓ


కృష్ణమాచారి

పాల్వంచరూరల్: వన్య మృగాల సంరక్షణ విభాగం పాల్వంచ డివిజన్ ఎఫ్‌డీఓ బాబు రెండు రోజుల కిందట సెలవుపై అమెరికాకు వెళ్లగా ఆయిన స్థానంలో ఇన్‌చార్జ్ ఎఫ్‌డీఓగా వరంగల్ ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీఓ పి.కృష్ణమాచారిని నియమించారు. శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

తల్లాడ తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు


సభకు వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జూలూరుపాడు: ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లిలో బీఆర్‌ఎస్ నేత రాయల వెంకటశేషగిరిరావు విగ్రహావిష్కరణ, బహిరంగసభకు శుక్రవారం జూలూరుపాడు మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ముఖ్య అతిథిగా హాజరయ్యే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు యల్లంకి సత్యనారాయణ, లకావత్ గిరిబాబు, పోలుదాసు గోపాలకృష్ణమూర్తి, భూక్యా సేవా, తాళ్లూరి రామారావు, భూక్యా జవహర్‌లాల్, పదిమల రాంబాబు, నాగరాజు తదితరులు వెళ్లారు.

బాలల రక్షభవన్‌లో తనిఖీ


నిర్వాహకులతో మాట్లాడుతున్న న్యాయసేవా సంస్థ కార్యదర్శి రాజేందర్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ఉన్న బాలల రక్ష భవన్‌ను శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల రక్షణపై తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించారు.

కేటీఆర్‌ను కలిసిన దిండిగాల


పుష్పగుచ్ఛం ఇస్తున్న రాజేందర్

ఇల్లెందు: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తల్లాడ విచ్చేసిన సందర్భంగా.. పార్టీ వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట నాయకులు రంగనాథ్, జాఫర్ హుస్సేన్, జబ్బార్, మునిగంటి శివ, అక్బర్ ఉన్నారు.

పాల్వంచ తహసీల్దార్‌గా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

పాల్వంచరూరల్: పాల్వంచ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వివేక్ బూర్గంపాడుకు బదిలీ కాగా ఆయిన స్థానంలో కలెక్టరేట్‌లో ఎలక్షన్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న తారా ప్రసాద్‌ను తహసీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు.

డీఆర్డీఓ బృందానికి కలెక్టర్ ప్రశంసలు


బృందాన్ని అభినందిస్తున్న కలెక్టర్ జితేశ్

చుంచుపల్లి: జిల్లాలో స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ ఎన్పీఏ రిడక్షన్ నిర్వహణలో భాగంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డీఆర్డీఓ టీమ్ సేవలను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం ప్రశంసించారు. జిల్లాలో మహిళా సంఘాల అభివృద్ధికి సెర్ప్ సిబ్బంది చేపడుతున్న చర్యలను ఆయన అభినందించారు. ఇదే ఉత్సాహంతో స్వయం సహాయక సంఘాల బలోపేతానికి మరింతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమష్టి కృషితో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ ఎం.విద్యాచందన డీపీఎంలు, ఏపీఎంలు, సెర్ప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి పనులు అక్కడే..

- వెక్కిరిస్తున్న శంకుస్థాపన శిలాఫలకాలు
- అభివృద్ధికి నోచుకోని పల్లె రహదారులు
- పనులు ఎప్పుడవుతాయోనని ఎదురుచూస్తున్న ప్రజలు


నాలుగు నెలల క్రితం రాఘబోయినగూడెం రహదారికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి (ఫైల్)

ఇల్లెందురూరల్: నిధులు మంజూరై అటవీశాఖ అభ్యంతరాలతో కొన్ని.. పనులు ప్రారంభించినా బిల్లులు రావడం లేదని మరికొన్ని.. శంకుస్థాపన పూర్తయినా టెండర్లు నిర్వహించలేదన్న కారణంతో ఇంకొన్ని రహదారుల పనులు ముందుకు సాగడం లేదు. ఇందులో కొన్ని నెలల తరబడి పెండింగ్‌లో ఉండగా.. మరికొన్ని ఏళ్ల తరబడి ఎక్కడ వేసి గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయాయి. ఫలితంగా గ్రామ పొలిమేరల్లో ఆర్భాటంగా వేసిన శంకుస్థాపన శిలాఫలకాలు దిష్టిబొమ్మల్లా కనిపిస్తుండగా.. రహదారులు అధ్వానంగా మారడంతో రాకపోకలకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి.

టెండర్లు నిర్వహించకుండానే..

ఇల్లెందు – ఖమ్మం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి రాఘబోయినగూడెం గ్రామ బీటీ రోడ్డుకు అనుసంధానం చేసేలా రూ.2 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి 2025 జనవరి 22న శంకుస్థాపన చేశారు. సుదిమళ్ల గ్రామపంచాయతీ జగదాంబ గుంపు నుంచి పాతనర్సాపురం మీదుగా సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ వరకు రూ.కోటి వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఆరు నెలల కిందట శంకుస్థాపన చేశారు. ఇల్లెందు – మహబూబాబాద్ ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి మామిడిగుండాల వరకు రూ.4.46 కోట్ల వ్యయంతో రహదారిపై బీటీ వేసేందుకు 2025 మార్చి 16వ తేదీన శంకుస్థాపన చేశారు. దీంతో ఆయా గ్రామస్తులు రహదారి సౌకర్యం మెరుగుపడుతుందని భావించినా నిరాశే ఎదురవుతోంది. ఆయా పనులకు టెండర్లు నిర్వహించకపోవడం ఇందుకు కారణమని చెబుతున్నారు.

అనుమతులు లేక ఏళ్ల తరబడి

ఇల్లెందు – గుండాల ప్రధాన రహదారి నుంచి మొండితోగు మీదుగా ధర్మాపురం గ్రామం వరకు 6.6 కి.మీ. పొడవున రూ.3.14 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు 2015 అక్టోబర్ 21న శంకుస్థాపన చేశారు. కానీ, ఇందులో 3.9 కి.మీ. అటవీ భూభాగం ఉందని పనులను అడ్డుకున్నారు. దీంతో 2016లోనే సర్వే చేసిన అటవీ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు 3.9 కి.మీ. స్థానంలో 2.57 హెక్టార్ల భూభాగం ఇవ్వాలని, నష్టపోయిన మొక్కలకు రూ.22.80 లక్షలు లెక్కకట్టి అటవీశాఖ ఉన్నతాధికారులకు పంపారు. అయినా అనుమతులు రాక పనులు అలాగే ఉండిపోయాయి. ఇక చల్లసముద్రం క్యాంపు సెంటర్ నుంచి ఆంజనేయపురం మీదుగా 5 కి.మీ. దూరం బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.3 కోట్ల వ్యయంతో 2018 జూలై 17వ తేదీన శంకుస్థాపన చేసినా అనుమతుల పేరిట ఒక కిలోమీటరు దూరం పనులు మిగిలిపోయాయి. ప్రజాప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు మంజూరు చేయాలి



మొండితోగు గ్రామం నుంచి ధర్మాపురం వరకు పదేళ్ల కిందట శంకుస్థాపన పూర్తి చేసుకున్న పనులు.. బీటీ రోడ్డు నిర్మాణ పనులు నేటికీ ముందుకు సాగడం లేదు. అటవీశాఖ అభ్యంతరంతో పరిహారం చెల్లించేందుకు 2016లో సర్వే చేసి నివేదిక సిద్ధం చేశారు. లోపం ఎక్కడుందో కానీ నేటికీ పనులు చేపట్టడం లేదు.

–సందిరి రమేశ్, మొండితోగు, ఇల్లెందు మండలం

పనులు త్వరలోనే పూర్తి చేస్తాం



అన్ని అనుమతులు ఉన్న రహదారుల పనులు వేగవంతగా పూర్తి చేస్తాం. కొన్ని పనులు టెండర్ దశలో ఉన్నాయి. ప్రక్రియ పూర్తికాగానే ప్రారంభిస్తాం. అటవీశాఖ అభ్యంతరం కారణంగా కొన్ని రహదారుల పనులు ముందుకు సాగడం లేదు. అనుమతుల మంజూరు కోసం అటవీశాఖ ఉన్నతాధికారులకు లేఖ పంపాం.

–రాజు, ఏఈ, పంచాయతీరాజ్‌శాఖ, ఇల్లెందు

తడిసిన ధాన్యాన్ని కొనాల్సిందే..


జూలూరుపాడు: తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు


సుజాతనగర్: తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న అన్నవరపు సత్యనారాయణ, నాయకులు

జూలూరుపాడు: అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు. అకాల వర్షానికి జూలూరుపాడు ఐకేపీ కేంద్రాల్లో తడిసిన వరి ధాన్యాన్ని సంఘం నాయకుల బృందం పరిశీలించింది. ఐకేపీ కేంద్రాల వద్ద కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం అకాల వర్షాలకు తడిసిపోయిందని, దీనిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం తేమశాతం, తాలు ఉందని కారణాలు చెపుతూ రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని, ప్రభుత్వం జోక్యం చేసుకొని కొనుగోళ్లు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు యల్లంకి మధు, చెరుకుమల్ల రాజేశ్వరరావు, ఎస్కే నాగుల్‌మీరా, కొండా వీరయ్య, ఎస్కే చాంద్‌పాషా, కంచర్ల రాజు, పాలెపు ప్రభాకర్, సతీశ్, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు బాధ్యత ప్రభుత్వానిదే..

సుజాతనగర్: సుజాతనగర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నెల రోజులుగా రైతులు ఆరబోసుకున్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ఆరోపించారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. నెల రోజులుగా ధాన్యం ఎండకు ఎండుతూ.. అకాల వర్షాలకు తడిసి మొలకలు వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కొనుగోలు కేంద్రానికి సమీపంలోనే మిల్లులు ఉన్నా.. తరలించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు కున్సోత్ ధర్మా, నాయకులు పుల్లయ్య, కొండె కృష్ణ, కున్సోత్ కిషన్, హరి, మౌలాలి, భగవాన్, శ్యామ్, నరసింహారావు పాల్గొన్నారు.

నిరుపయోగంగా క్రీడామైదానాలు


ఒకే స్థలంలో ఏర్పాటు చేసిన రెండు మైదానాలు

టేకులపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించి, వారిలోని నైపుణ్యాన్ని వెలికి తీయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఓ క్రీడా మైదానం మంజూరు చేసి సుమారు రూ.2 లక్షల వ్యయంతో సౌకర్యాలు కల్పించింది. అయితే, మైదానాలు క్రీడాకారులకు ఉపయోగపడతాయా? లేదా అని ఆలోచించకుండానే వినియోగించలేని స్థలాల్లో, సుదూర ప్రాంతాల్లో హడావిడిగా ఏర్పాటు చేశారు. వీటిల్లో పది శాతం కూడా వినియోగంలో లేకపోవడం గమనార్హం. మండలంలోని రామచంద్రునిపేట జీపీ పాతర్లగడ్డ, తోలెం రామయ్యగుంపు గ్రామాలకు చెందిన క్రీడా మైదానాలను ఒకే ఒకే స్థలంలో ఏర్పాటు చేశారు. ఎడమవైపు పాతర్లగడ్డ, కుడివైపు తోలెంరామయ్య గుంపు ప్రవేశ ద్వారాల బోర్డులు ఏర్పాటు చేశారు. వ్యాయామం కోసం వేసిన రాడ్లు, షటిల్ కోర్టు స్తంభాలను అప్పుడప్పుడు పశువులను కట్టేందుకు వినియోగిస్తుండటం గమనార్హం.

ఏరియాల్లో నిఘా పెంచాలి


వీసీలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

సింగరేణి(కొత్తగూడెం): అన్ని ఏరియాల్లోని పని ప్రదేశాలు, లోడింగ్ పాయింట్ల వద్ద నిఘా పెంచాలని, అన్ని ప్రాంతాల వద్ద ఎస్‌ఓపీ, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను అమలు చేయాలని, ప్రతి లారీని క్షుణ్ణంగా పరిశీలించాలని జీఎం సెక్యూరిటీ లక్ష్మీనారాయణ ఆదేశించారు. శుక్రవారం అన్ని ఏరియాల సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏరియాల్లో సెక్యూరిటీ కోసం ఆయా ప్రాంత పోలీస్ ఉన్నతాధికారులతోపాటు సీఐఎస్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులతో సంబంధాలు కలిగి ఉండాలన్నారు. చెక్ పోస్టుల్లో బొగ్గు లోడింగ్ పంపించే ముందు అన్ని పత్రాలు పరిశీలించాలని, అవసరమైతే ఆయా డాక్యుమెంట్లు, స్కీన్ చేయించి పెట్టుకోవాలని సూచించారు. ప్రధానంగా ఎక్స్‌ప్లోజివ్స్, మ్యాగ్జిన్స్, ఎస్టీపీపీ, సోలార్ ప్లాంట్స్, డీజిల్ బంకుల వద్ద సెక్యూరిటీని అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. చోరీలు జరగకుండా అన్ని ఏరియాల్లోని కాలనీల్లో పెట్రోలింగ్ పెంచాలని, స్క్రాప్ యార్డ్‌ల వద్ద ఫెన్సింగ్, ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం వేణుమాధవ్, ఎస్అండ్‌పీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సరైన మోతాదులో వాడాలి


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణమ్మ

సుజాతనగర్: ఎరువులు, పురుగుమందులు తగిన మోతాదులో వాడాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ అన్నారు. ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’ కార్యక్రమాన్ని నర్సింహసాగర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనల మేరకు రసాయన ఎరువులు, పురుగుమందులను తగ్గించి పంటలను పండించడం రైతులకు ఎంతో లాభదాయకమని తెలిపారు. భూతల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, విత్తనాలు కొన్నప్పుడు ఇచ్చిన రశీదును రైతులు భద్రపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త శివ, ఏఓ నర్మద, ఏఈఓలు శరత్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌పై హర్షం


నినాదాలు చేస్తున్న ‘గాంధీపథం’ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: పెహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులకు బదులుగా ఆపరేషన్ సిందూర్‌తో భారత సైన్యం తగిన బుద్ధి చెప్పిందని గాంధీపథం జిల్లా కన్వీనర్ చింతలచెర్వు గెర్షోము తెలిపారు. భారత సైన్యానికి అభినందనలు తెలుపుతూ గాంధీపథం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. భారత సైన్యం వెంటనే స్పందించి ఎదురుదాడి చేసిన తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. కార్యక్రమంలో గాంధీపథం సభ్యులు గురుమూర్తి, వెంకటేశ్వరరావు, తిరుపతయ్య, సుధాకర్‌రెడ్డి, పూజ, సత్యనారాయణ పాల్గొన్నారు.

జర్నలిస్టుల జేఏసీ ఆధ్వర్యంలో..

జర్నలిస్టుల జేఏసీ ఆధ్వర్యంలో భారత సైన్యాన్ని అభినందిస్తూ జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టుల జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా ఉపాధ్యక్షుడు ఏదులాపురం గోపాల్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం జూలూరుపాడులో కార్మికులతో కలిసి సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సార్వత్రిక సమ్మె చేస్తున్నామని తెలిపారు. 4 లేబర్‌కోడ్‌ల అమలును తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాయల సిద్ధు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి బానోత్ ధన్వంతరావు, వీరభద్రం, సేవ్యా, నవీన్, హరికృష్ణ, సురేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు కొత్తగూడెం ఏడీఈ హేమచంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామవరం, చిట్టిరామవరం, 2 ఇంక్‌లైన్ పంచాయతీ, ప్రశాంతినగర్‌లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

1,818 మందికి నిలిచిన పెన్షన్

సింగరేణి(కొత్తగూడెం): లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వని కారణంగా 1,818 మందికి కోల్‌మైన్స్ పీఎఫ్ పెన్షన్ నిలిచిపోయింది. సంస్థలో పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు పెన్షన్ అందిస్తున్న విషయం విదితమే. అయితే, విరమణ పొందిన ప్రతి కార్మికుడు ఏటా మార్చి 31లోపు లైఫ్ సర్టిఫికెట్ అందించాల్సి ఉంది. 1,818 మంది (సింగరేణి వ్యాప్తంగా) లైఫ్ సర్టిఫికెట్ సమర్పించని కారణంగా పెన్షన్ నిలిచిపోయింది. రిటైర్డ్ ఉద్యోగులు జీవించి లేకపోతే వారి భార్య లైఫ్ సర్టిఫికెట్‌ను అందించి పెన్షన్ పొందవచ్చని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అకవందార్ వేణుమాధవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫారంపాండ్ నిర్మాణాలు పెంచాలి

ఇల్లెందురూరల్: నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ఫారంపాండ్, ఇంకుడు గుంతల నిర్మాణాలు పెంచాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అవసరమైన మేరకు ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. గ్రామాల్లో రైతులను చైతన్యపర్చి ఫారంపాండ్ నిర్మాణాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని చెప్పారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరవుతాయని, సత్వరం నిర్మించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. వీటి నిర్మాణాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ చిరంజీవి, ఏపీఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బస్వతారకకాలనీకి శవపేటిక వితరణ

పాల్వంచరూరల్: మండలంలోని బస్వతారక కాలనీ మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ కోరిక మేరకు శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ నల్ల సురేశ్‌రెడ్డి శుక్రవారం శవపేటికను వితరణగా అందించారు. గ్రామ పంచాయతీ చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు ఎవరైనా మరణించినప్పుడు ఫ్రీజర్ బాక్స్‌లేని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, శవపేటిక ఇప్పించాలని సురేశ్‌రెడ్డిని కోరిన వెంటనే అందించారని శ్రీనివాస్ హర్షం వ్యక్తంచేశారు. శవపేటిక అవసరమైనవారు 90140 42810, 97012 30727 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

‘సాక్షి’ ఎడిటర్ నివాసంలో సోదాలు హేయం


నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

పాల్వంచ: వాస్తవాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తుండటాన్ని జీర్ణించుకోలేక సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసంలో ఎలాంటి అనుమతి లేకుండా సోదాలు చేయడం అప్రజాస్వామికమని పలువురు సీనియర్ జర్నలిస్టులు పేర్కొన్నారు. అమరావతిలో సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో సెర్చ్ వారంట్ లేకుండా పోలీసులు చొరబడి బెదిరింపులకు దిగడాన్ని ఖండిస్తూ శుక్రవారం పాల్వంచ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల గొంతుకగా నిలుస్తున్న పత్రికలపై, ఏకంగా ఎడిటర్ల ఇళ్లల్లోనే సోదాలు జరపడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు ఆర్.సంజీవ్‌కుమార్, దారా శ్రీనివాసరావు, షేక్.సుభానీ, రాళ్లబండి కృష్ణమూర్తి, తోట శ్రీనివాసరావు, షేక్ రజాక్, పంజాల వెంకటనారాయణ, సత్తిబాబు, బి.రమేశ్, అడపాల వెంగళరావు, నజీరుద్దీన్, కొప్పుల రవీందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫాసిజం పెను ప్రమాదం


మాట్లాడుతున్న నబీ

ఇల్లెందు: భూమిపై కమ్యూనిజం లేకుండా చేస్తానని ప్రగల్భాలు పలికిన హిట్లర్ ఫాసిజం నుంచి సోవియట్ యూనియన్‌ను స్టాలిన్ నాయకత్వంలో కాపాడిన చరిత్ర మర్చిపోలేమని సీపీఎం జిల్లా నాయకులు ఎస్ఏ నబీ తెలిపారు. శుక్రవారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. గత నెలలో ఓ రష్యన్ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో 91 కమ్యూనిస్ట్ పార్టీలు సమావేశమై సామ్రాజ్యవాదం, ఫాసిజంకు వ్యతిరేకంగా భవిష్యత్‌లో పోరాటాలు నిర్మించాలని నిర్ణయించాయన్నారు. కార్యక్రమంలో కృష్ణ, మోహన్‌రావు, ఈసం వెంకటమ్మ, వాసం రాము, మహమూద్, సత్యనారాయణ కోరీ, మాధవి, దుర్గాలాల్ పాసీ, వీరయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చెత్త సేకరణ సంచుల పంపిణీ


సంచులు పంపిణీ చేస్తున్న

ఇల్లెందు: ప్రత్యేకంగా రూపొందించిన తడి, పొడి సంచులను పట్టణంలోని కాకతీయనగర్‌లో ఇంటింటికీ పంపిణీ చేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ చేతులమీదుగా బస్తీవాసులకు ఈ సంచులు అందిజేసి, ప్రతీ బుధవారం, శనివారం మాత్రమే పొడి చెత్తను ఈ సంచుల్లో భద్రపర్చి వాహనానికి అందజేయాలని, మిగిలిన రోజుల్లో తడి చెత్తను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంకుషావలి, మాజీ కౌన్సిలర్ నాగలక్ష్మి, ఇమామ్, పడిదల నవీన్, మెప్మా సీఓ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి వినతి


మంత్రిని సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నేతలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమస్యలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్లు నరసింహారెడ్డి, ధర్మపురి త్యాగరాజన్, కాంపెల్లి సమ్మయ్య, జెట్టి శంకర్‌రావు, వికాస్‌కుమార్, యాదవ్, రాజేందర్, అక్రమ్, రజాక్, పీతాంబరం, నరేందర్, శేషారత్నం పాల్గొన్నారు.